ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు


5★

ఆదివారం 2 మార్చి 2025

నేడు శ్రీపాదరావు జయంతి
- ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్‌గా సేవలు
- అధికారికంగా నిర్వహణ



6



న్యూస్ బాక్స్

ముఖ్యమంత్రిని కలిసిన ప్రభుత్వ విప్



ధర్మారం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం హైదరాబాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ధర్మపురి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. నేరెళ్ళకు మంజూరైన నవోదయ పాఠశాలను నిజామాబాద్ తరలించేందుకు బీజేపీ కుట్ర పన్నుతుందని పాఠశాలను నేరెళ్లలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33, 11 కేవీ సబ్‌స్టేషన్ల మరమ్మతు కారణంగా పెద్దపల్లి, రంగంపల్లి, నిట్టూరు. పెద్దబొంకూర్, పెద్దకల్వల గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి తొమ్మిదిన్నర వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

10వ తేదీ నుంచి సైకాలజిస్ట్‌లకు శిక్షణ

కోల్‌సిటీటౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 10వ తేదీ నుంచి 13వతేదీ వరకు సైకాలజిస్ట్‌లకు శిక్షణ ఇస్తున్నట్టు సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్, రాష్ట్ర నాయకులు మేజిక్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. సైకాలజిస్టుల నైపుణ్యాభివృద్ధే ధ్యేయంగా అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. శిక్షణకు ఉభయ తెలుగు రాష్ట్రాల సైకాలజిస్టులు, శిక్షకులు హాజరుకావచ్చని తెలిపారు. వివరాలకు 9533660938లో సంప్రదించాలన్నారు.

మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు

- జంబో బ్యాలెట్‌తో జాప్యం జరిగే అవకాశం
- పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 21 టేబుళ్లు
- ఉపాధ్యాయుల నియోజకవర్గానికి 14 టేబుళ్లు



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

56 మంది అభ్యర్థులు, 773 పోలింగ్ కేంద్రాలు , 2,50,328 ఓట్లు

ఇవీ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ లెక్కలు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను లెక్కింపు కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు త్వరగా ముగిసినా, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు రెండు, మూడు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. దీంతో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు షిఫ్టుల్లో ఓట్లు లెక్కించాలని నిర్ణయించారు. పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 21 టేబుళ్లు, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు సిద్ధం చేశారు. ప్రతి టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు విధులు నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

6

ప్రారంభించి మూడేళ్లు..
పునాదులు దాటని పనులు

- అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు
- వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌కు గ్రహణం
- ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవచూపాలంటున్న ప్రజలు



పిల్లర్ల వరకే పరిమితమైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

సుల్తానాబాద్, మార్చి 1: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపో యాయి. పునాదులకే పరిమతమైన ఈ పనులు గురించి పట్టించుకున్న నాధుడే కరువయ్యారు. దీంతో మార్కెట్ నిర్మాణానికి వెచ్చించిన నిధులు వృథా అయ్యాయి. పిల్లర్ల కోసం వేసిన ఇనుప చువ్వలు వర్షాలకు తుప్పు పడుతున్నాయి. మూడేళ్లు కావస్తున్నా ప్రజాప్రతి నిధులు, అధికారులు స్పందించకపోవడం గమనార్హం. పునాదులకే పరిమితమైన మార్కెట్ పనుల గురించి మున్సిపల్ పాలకవర్గంలో కూడా ఏ ఒక్క కౌన్సిలర్ కూడా



సుల్తానాబాద్‌లో రోడ్డు పక్క నిర్వహిస్తున్న సంత

ఈ అంశాన్ని ప్రస్తావించకపోవడం కొస మెరుపు.

● రెండు కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్

సుల్తానాబాద్ పట్టణంలో ప్రజల అవసరాల కోసం ప్రస్తుత కూరగాయల మార్కెట్ సరిపోవడం లేదని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆధునిక సౌకర్యాలతో మార్కెట్ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్ల నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులను 27 జూన్ 2022 లో అప్పటి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. కొద్ది రోజుల్లోనే పనులు కూడా ప్రారంభించారు. శంకుస్థాపన చేసి మూడు ఏళ్లు కావస్తుంది. పనులు మాత్రం పునాదులు దాటలేదు. పునాదులు పూర్తయి పిల్లర్ల నిర్మాణం కోసం ఐరన్ రాడ్స్ నిలబెట్టారు. ఇక అంతే.. అప్పటి నుంచి ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకున్న వారు లేకుండా పోయారు. నిధులు మంజూరైన వరకే పనులు చేసి వదిలేశారని కొందరు మాజీ కౌన్సిలర్లు అంటున్నారు. ఏది ఏమైనా గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ పనులు వారి హయాంలోనే అర్థాంతరంగా ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఆగిపోయిన నిర్మాణం పనుల గురించి ఒక కార్యాచరణ లేకుండా పోయింది. అధికారులు, స్థానిక నేతలు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి నిలిచి పోయిన పనులు పూర్తి చేయించేందుకు పూనుకోవాలి.

● సుల్తానాబాద్ మార్కెట్‌లో తప్పని తిప్పలు

సుల్తానాబాద్ పట్టణంలో దశాబ్దాల తరబడి వార సంత నిర్వహణ నడిరోడ్డు పైనే కొనసాగుతోంది. ఇలా రోడ్ల పై మార్కెట్ నిర్వహించడం వలన వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నా యి. ఇరుకు గా ఉన్న సంతలో కొనుగోలు దారులతో,

మిగతా 8వ పేజీలో...

కోర్టు ఏర్పాటుకు భవనాల పరిశీలన



కోర్టు కోసం భవనాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి, జడ్జి గణేష్

ఓదెల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కోర్టు ఏర్పాటుకు శనివారం నోడల్ అధికారి, సుల్తానాబాద్ సివిల్ కోర్టు జడ్జి గణేష్ సందర్శించారు. ప్రతిపాదనలో ఉన్న ముంజాల మధు, పచ్చిమట్ల సునీల్, ఇరుకుల్ల సత్యనారాయణకు చెందిన భవనాల్లో మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. మరో పది రోజుల్లో ఓదెలలో కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. కోర్టుకు అనుకూలంగా సౌకర్యాలు కల్పించాలని జడ్జి యజమానులను కోరారు. భవనాల్లో కోర్టు, చాంబర్, బార్ అసోసియేషన్ కార్యాలయం, కేసు రిజిస్టర్ల నిల్వ గది, కక్షిదారులు వేచి ఉండు గది, పార్కింగ్, మరుగుదొడ్ల సౌకర్యం, తాగునీటి సౌకర్యాలు ఏర్పాట్లపై నోడల్ అధికారి మూడు భవనాలన పరిశీలించారు. భవనాలను న్యాయవాది అంబాల రాజు జడ్జికి వివరించారు. పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్, సూపరింటెండెంట్ కొమురయ్య, న్యాయవాదులు రాజు, తిరుపతి, నరసయ్య, ఆర్అండ్‌బి ఏఈ తోపాటు పలువురు పాల్గొన్నారు.

నేరస్తులను పట్టుకోవడంలో జాగిలాల పాత్ర కీలకం



కమిషనరేట్‌కు చేరుకున్న జాగిలాలను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నేరస్తులను పట్టుకోవడంలో జాగిలాల పాత్ర కీలకమని సీపీ శ్రీనివాస్ అన్నారు. కమిషనరేట్‌కు మూడు జాగిలాలను కేటాయించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పొందిన జాగిలాలు శనివారం కమిషనరేట్‌కు వచ్చాయి. సీపీ మాట్లాడుతూ నార్కొటిక్, గంజాయి, మత్తు పదార్థాల గుర్తింపు, ఎక్స్‌ప్లోజివ్స్ గుర్తించడంలో కీలక పాత్ర పోషించనున్నట్టు చెప్పారు. డీసీపీ(అడ్మిన్) రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు పాల్గొన్నారు.

అమరులకు ఘనంగా నివాళి

కమాన్‌పూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో మాదిగ సోదరులు 30సంవత్సరాల ఉద్యమపోరాట సమయంలో అమరులైన వారికి నివాళులర్పించారు. బీసీ సంఘాలు, వివిధ పార్టీ రాజకీయ నాయకులు పాల్గొని అమరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి శంకర్, మల్యాల తిరుపతి, అరుణ్‌కుమార్, చంద్రమౌళి, వెంకన్న, పోషం పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ లక్ష్యాలను పూర్తి చేయాలి : కలెక్టర్



డీపీఎం, ఏపీఎంలతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల పనితీరు మెరుగుపరిచేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వశక్తి మహిళా సంఘాలపై సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ లింకేజ్ నిర్దేశించుకున్న లక్ష్యంలో ఇప్పటి వరకు 90 శాతం మేర రుణాలు పంపిణీ పూర్తి చేశారని, మిగి తా రుణాల పంపిణీ ఈనెల 15 వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్త్రీ నిధి రుణాల రికవరీ 72 శాతం నుంచి 80 శాతం పెంచడంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు.

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద గ్రౌండ్ చేసిన యూనిట్లు లాభదాయకంగా నడిచేలా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేయాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి కింద పెట్రోల్ బంక్, గ్యాస్ ఏజెన్సీ, డెయిరీ వంటి పెద్ద పెద్ద యూనిట్ల స్థాపనకు చర్యలు చేపట్టాలన్నారు. వీ-హబ్ ద్వారా శిక్షణ అందించేందుకు వీలుగా జిల్లాలో వందమంది మహిళలను సన్నద్ధం చేయాలని తెలిపారు.

ముత్తారం మండలంలోని మిర్చి యూనిట్ ఏర్పాటుకు మహిళా సంఘాల ద్వారా 7.5 లక్షల రూపాయల డిపాజిట్ చెల్లించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీకి క్లాత్ వారం రోజులలో జిల్లాకు చేరుకుంటుందని, విద్యార్థుల కొలతలు సరిగ్గా తీసుకొని నాణ్యతతో కూడిన యూనిఫాం విద్యార్థు లకు అందేలా మహిళా సంఘాల ద్వారా కుట్టు పని జరగాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మంథని మండలంలోని సిరిపురం, శ్రీరాంపూర్ మండల కేంద్రంలో మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, అడిషనల్ డీఆర్‌డీఓ రవికుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 4 నియామకాలలో కొత్తగా ఉద్యోగాలు పొందిన మున్సిపల్ ఉద్యోగులు తమ విధులను పారదర్శకంగా నిర్వహించి మోడల్ వార్డులను తయారు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. గ్రూప్ 4 నియామకాలలో ఎంపికైన వార్డు అధికారులకు (జూనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అకౌంట్స్ అధికారులు) ఎన్టీపీసీ ఈడీసీ ఆడిటోరియంలో శనివారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడు తూ నూతన మున్సిపల్ చట్టంపై వార్డు అధికారులు, గ్రూప్ 4 ఉద్యోగులకు అవగాహన ఉండాలని సూచిం చారు. వార్డులలో పారిశుధ్య పనులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, తాగు నీటి సరఫరా, వివిధ రకాల సేవలు ప్రజలకు త్వరిత గతిన అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో పచ్చదనం పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. జనం ఎక్కువగా ఉండే ప్రాంతాలలో పారిశుధ్యం సక్రమంగా ఉండేలా చూడాలని, రోడ్లపై ప్లాస్టిక్, చెత్త లేకుండా చూడాలని సూచించారు. వార్డు లలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత తగ్గకుండా ఉం డేలా పర్యవేక్షించాలన్నారు. అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, పాల్గొన్నారు.



ఎన్టీపీసీలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ధేశించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ పంచాయతీ రాజ్ విభాగానికి సంబంధించి పురోగతి ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జిల్లాలోని హెల్త్ సెంటర్ల మరమ్మతు పనులు, పాఠశాలల మరమ్మతు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు, రెసిడెన్షియల్ పాఠశాలల, హాస్టల్స్ మర మ్మతు పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. నిధులను వినియోగించుకుంటూ ఏప్రిల్ లోపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధిహామీ కింద మంజూరు చేసిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఈనెల 15 లోగా పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని కలెక్టర్ అధికారు లకు సూచించారు. ఈఈ పంచాయతీ రాజ్ గిరీష్‌బాబు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ అధికారులు పాల్గొన్నారు.

కిష్టంపేట రైతుకు ఉత్తమ అవార్డు



ఉత్తమ రైతు అవార్డు అందుకుంటున్న కొప్పుల సత్యం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కొప్పుల సత్యం అనే రైతు ఉత్తమ రైతు అవార్డును అందుకున్నాడు. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ కృషివిజ్ఞాన కేంద్రం జహీరాబాద్‌లో పంటల రకాలు రైతుల హక్కుల పరిరక్షణపై కృషి విజ్ఞాన కేంద్రాలకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా కిష్టంపేటకు చెందిన రైతు కొప్పుల సత్యం మేలైన వరి రకాలను సంరక్షిస్తూ, రైతులకు పలు రకాల విత్తనాలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతు అవార్డును డాక్టర్ విలోచనమహోపత్ర చేతులమీదుగా సత్యం అందుకున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు వెంకన్న, వినోద్, పాల్గొన్నారు. కొప్పుల సత్యంను కొండా లక్ష్మణ్‌బాపూజీ ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి, డాక్టర్ విజయ్ అభినందించారు.

ఫిబ్రవరిలో లక్ష టన్నుల ఉత్పత్తి : ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం

కోల్‌సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్)లో ఫిబ్రవరిలో లక్ష టన్నుల ఉత్పత్తి సాధించినట్టు సీజీఎం ఉదయ రాజహన్స శనివారం ప్రకటించారు. దేశంలో ఎరువుల కొరతను తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో ఆర్ఎఫ్‌సీఎల్‌ను ప్రారంభించారని, 2021 మార్చి 22న కర్మాగారం పూర్తిస్థాయిలో ఉత్పత్తులు ప్రారంభమయ్యాయన్నారు. ప్రస్తుతం ప్లాంట్‌లో ఉత్పత్తి అయిన నీమ్ కోటెడ్ యూరియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. ఫిబ్రవరిలో 1,03,912.38 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేశామని, ఇందులో తెలంగాణకు 58వేల మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 29వేల మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 10.6వేల మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 56.18 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్టు తెలిపారు. సంస్థ పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యాన్ని 1.03లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని సాధించటంలో కీలకపాత్ర పోషించిన కార్మికులు, ఉద్యోగులు, అధికారులకు ఆర్ఎఫ్‌సీఎల్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి అభినందనలు తెలిపారు. అలాగే సంస్థకు మద్దతుగా ఉన్న రాష్ట్ర, జిల్లా యంత్రాంగానికి, కేంద్ర ఎరువులు, రసాయనాలు మంత్రిత్వ శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



జిల్లా విద్యాధికారి మాధవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

పెద్దపల్లి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాదించాలని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. శనివారం అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాధవి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని అలరించాయి. డీఈవోను ఉపాధ్యాయ బృందం సన్మానించింది. ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, హన్మంతు, మూల రాంరెడ్డి లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

- సూసైడ్ నోట్‌ను కొంగున కట్టుకుని బావిలో దూకిన యువతి
- వేధింపులే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ



పల్లవి (ఫైల్)

వేములవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అత్తింటి వారి వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడరూరల్ మండలం అచ్చన్నపేట గ్రామానికి చెందిన కొక్కుల దేవరాజం కుమార్తె పల్లవి(23) వివాహం వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మ్యాన శివుడు అనే యువకుడితో 2021లో జరిగింది. పెళ్లి అయిన కొద్ది రోజులకే భర్తతోపాటు అత్త విజయ, కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో పలుమార్లు పంచాయతీలు జరిగాయి. అయినప్పటికీ వేధింపులు ఆగకపోవడంతో శనివారం తెల్లవారుజామున వేములవాడ పట్టణ శివారులోని చెక్కపల్లి రోడ్డులోగల ఓ వ్యవసాయ బావిలో దూకి పల్లవి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహానికి ఉన్న చీర కొంగుకు పల్లవి రాసిపెట్టిన సూసైడ్ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు తండ్రి దేవరాజం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు.

మనస్థాపంతో ఒకరి బలవన్మరణం

బోయినపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కుల సంఘంలో తీసుకున్న చిట్టీ డబ్బులు సకాలం చెల్లించక మనస్థాపం చెందిన ఓవ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో శనివారం జరిగింది. ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపినవివరాల ప్రకారం.. గ్రామానికిచెందిన పబ్బాల కొమురయ్య(55) కుల సంఘంలో 30వేల రూపాయల చిట్టీ డబ్బులు తీసుకున్నాడు. శనివారం కుల సంఘం సమావేశం ఉండడంతో తీసుకున్న డబ్బులను కొమురయ్య సకాలంలో చెల్లించే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై వ్యవసాయ పొలం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్ కిందపడి ఒకరి దుర్మరణం



ప్రశాంత్ (ఫైల్)

జమ్మికుంట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన ఐలవేణి ప్రశాంత్(32) ట్రాక్టర్ అదుపుతప్పి కెనాల్‌లో పడి శనివారం మృత్యువాతపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంత్ తనసొంత ట్రాక్టర్‌పై పనుల నిమిత్తం జమ్మికుంటకు వస్తున్నాడు. మార్గమధ్యలో ధర్మారం వద్దకు రాగానే ట్రాక్టర్ కుడిటైర్ పగిలి అదుపు తప్పి కెనాల్‌లో పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ భాగం ప్రశాంత్ మీద పడటంతో అక్కడికి అక్కడే మృత్యువాతపడ్డాడు. మృతుడి భార్య రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కొత్తపల్లి చెరువులో పడి కొత్తపల్లికి చెందిన వృద్ధుడు రాపెల్లి రాజయ్య(88) మృతి చెందినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. రాజయ్య శుక్రవారం బయటకు వెళ్లివస్తానని చెప్పి రాత్రి వరకు తిరిగి ఇంటికిరాలేదు. దీంతో ఆయన కొడుకు, బంధువులు రాజయ్య కోసం గాలిస్తూ కొత్తపల్లిలోని చెరువు వద్ద చూడగా అక్కడ అతని చెప్పులు, బట్టలు కనిపించాయి. అనుమానంతో చెరువులో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం గజఈతగాళలతో గాలించగా రాజయ్య మృతదేహం లభ్యమైంది. రాజయ్య బహిర్భూమికి వెళ్లి చెరువులో జారిపడి మృతి చెంది ఉంటాడని మృతుడి కొడుకు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

తల్లి మందలించిందని.. యువకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామానికిచెందిన హరీష్ అనేయువకుడు శనివారం మధ్యాహ్నం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హరీష్ తల్లి రూ.500 వేరే వాళ్ళకి ఇచ్చి రమ్మని పంపించగా హరీష్ ఆ డబ్బులను మిత్రులతో కలసి మద్యం కోసం ఖర్చు చేశాడు. మద్యం తాగి వచ్చిన కొడుకును తల్లి మందలించింది. బయటికి వెళ్లిన హరీష్ క్రిమి సంహారక మందు తాగాడు. అనంతరం ఇంటి సమీపంలోని వారి ఇంటికివెళ్ళగా గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం హరీష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు

- జంబో బ్యాలెట్‌తో జాప్యం జరిగే అవకాశం
- పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 21 టేబుళ్లు
- ఉపాధ్యాయుల నియోజకవర్గానికి 14 టేబుళ్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను లెక్కింపు కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచిన కరీంగర్ అంబేద్కర్ స్టేడియంలోనే ఈ నెల 3న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 2,50,328 మంది ఓటర్లు, ఉపాధ్యాయ నియోజక వర్గంలో 24,968 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రుల నియోజక వర్గంలో 56 మంది అభ్యర్థులు పోటీలో ఉండ డంతో జంబో బ్యాలెట్ ఏర్పాటు చేశారు. దీంతో ఓట్ల లెక్కింపులో జాప్యం జరిగే అవకాశం ఉంది. కనీసం రెండు రోజులు ఓట్ల లెక్కి ంపు కొనసాగే అవ కాశం ఉండడంతో మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.



● పకడ్బందీ ఏర్పాట్లు

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసేందుకు పోలీసులు అంబేద్కర్ స్టేడి యం వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పూర్తి చేసింది. పట్టభద్రుల ఓట్ల లెక్కింపు కోసం 21 టేబుళ్లు, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లు సిద్ధం చేశారు. ప్రతి టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు విధులు నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి రెండు, మూడురోజులు పట్టే అవకాశమున్నందున మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు సిబ్బందిని నియమించారు.

● అంబేద్కర్ స్టేడియం వద్ద పటిష్ట భద్రత

ఓట్ల లెక్కింపు చేసే హాళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబేద్కర్ స్టేడియం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని 773 పోలింగ్ కేంద్రాల నుంచి తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్సులను అంబేద్కర్ స్టేడియం స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి, మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సులను ఉంచిన గదుల ముందు మొదటి దశలో కేంద్ర బలగాలను, రెండో దశలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ బలగాలను 89 మందిని మోహరించారు. స్టేడియం చుట్టూ సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నారు. స్టేడియం బయట ప్రధాన ద్వారా వద్ద భారీ ఎల్‌సీడీ స్క్రీన్ ఏర్పా టు చేశారు. ఈ స్క్రీన్‌పై అభ్య ర్థులు బ్యాలెట్ బాక్సుల భద్ర తను పరిశీలించే వీలు కల్పించారు. ఓట్ల లెక్కింపు వద్ద శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు 400 మంది పోలీసు సిబ్బంది రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలు

శంకరపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ ఎక్స్‌రోడ్‌లోని వీఎస్సార్‌గార్డెన్ సమీపంలో కుక్క అడ్డు రాగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం ఆరెపల్లిగ్రామానికి చెందిన గుంటి అయిలయ్య వ్యక్తిగత పనినిమిత్తం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. మొలంగూర్ క్రాస్‌రోడ్‌లోని వీఎస్సార్‌గార్డెన్ సమీపంలో కుక్కలు పోట్లాడుకుంటున్నాయి. అయిలయ్య తన ద్విచక్ర వాహనం(టీవీఎస్ ఎక్సెల్)పై వస్తుండగా ఒకకుక్క అడ్డురాగా అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతోకుడిచేయి విరిగింది. గమనించిన స్థానికులు108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు యువకుడికి..

ఇల్లందకుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైస్‌మిల్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న యువకుడు ప్రమాదవశాత్తు కారు ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. మండల కేంద్రానికి చెందిన శనిగరపు రాజు బైక్‌పై వెళ్తున్నాడు. ఇదే క్రమంలో ఒకవ్యక్తి బైక్‌పై వస్తున్న రాజును గమనించక కారు ఆపి డోర్‌తీశాడు. అనంతరం బైక్ కారుడోర్‌ను ఢీకొట్టింది. దీంతో రాజు తలకు తీవ్రగాయాల య్యాయి. వెంటనే స్థానికులు రాజును జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఒకటి అంకెను మూడు రకాలుగా పరిగణలోకి తీసుకోవాలి

- ఎన్నికల కమిషన్, కరీంనగర్ ఆర్వోకు కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రుద్ర సంతోష్ వినతి



రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రుద్ర సంతోష్

కరీంనగర్ అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీకి జరిగిన పోలింగ్‌లో మొదటి ప్రాధాన్యత ఓటు విషయంలో ఒకటి అంకెను మూడురకాలుగా పరిగణించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, టీపీసీసీ నేత రుద్ర సంతోష్ శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు, జిల్లా ఎన్నికల అధికారికి విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు ఒకటి అంకెను మూడు రకాలుగా వేసిన విధానాన్ని వివరిస్తూ ఆయన ఒక వినతిపత్రాన్ని వారికి అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేసేందుకు పట్టభద్రుల ఓటర్లు ఒకటి అంకెను మూడు రకాలుగా రాయవచ్చని. ఆ మూడు రకాల అంకెలను వివరిస్తూ, మూడు రకాలుగా ఒకటి అంకెను ఎవరు రాసినా దానిని పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

నేడు శ్రీపాదరావు జయంతి

- ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్‌గా సేవలు
- అధికారికంగా నిర్వహణ



మంథని, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శాసనసభ మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి ఆదివారం జరగనుంది. శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్నారు. కాటారం మండలం ధన్వాడలో కమలాబాయి- రాధాకిష్టయ్యలకు మార్చి 2, 1937లో జన్మించారు. మంథని నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొంది ఉమ్మడి రాష్ట్ర శాసన సభా స్పీకర్ స్థానాన్ని అలంకరించారు. స్వగ్రామమైన ధన్వాడ సర్పంచ్‌గా రాజకీయ ఆరంగేటం చేసిన ఆయన మహదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, పొగాకు బోర్డు చైర్మన్‌గా, మంథని ఎల్ఎంబీ బ్యాంక్ చైర్మన్‌గా, డీసీసీలో, పీసీసీలో అనేక పదవులు నిర్వహించారు. 1983, 1985, 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంథని ఎంఎల్ఏగా గెలుపొందిన శ్రీపాదరావు ఉమ్మడి రాష్ట్ర శాసనసభా స్పీకర్‌గా నియమితులై 1994 వరకు కొనసాగారు. మంథని ప్రాంత అభివృద్ధి ప్రదాతగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. మహదేవపూర్ మండలం అన్నారం అటవీ ప్రాంతంలో శ్రీపాదరావును మావోయిస్టు 1999 ఏప్రిల్ 13న హత్య చేశారు. శ్రీపాదరావు భౌతికంగా దూరమై 24 యేళ్ల గడిచినప్పటికీ నేటికి ఇక్కడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. నియోజకవర్గంలో శ్రీపాదరావు జయంతి నిర్వహణకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబు, ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు సన్నాహాలు చేపట్టారు.

మడేలేశ్వర స్వామి ఆలయంలో చోరీ

ముస్తాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని మడేలేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఇటీవల మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిసిన క్రమంలో దొంగలుపడ్డారు. దాదాపు 8 వేల రూపాయలను హుండీలో నుంచి ఎత్తుకెళ్లినట్లు రజక సామజికవర్గం నాయకులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బీర్‌పూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్(42) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్సైరవీందర్ శనివారం తెలిపారు. శ్రీనివాస్ శుక్రవారం ఉదయం ఇంటినుంచి బయటకువెళ్లి ఇంటికి వచ్చి కింద పడిపోయాడు. తాను గడ్డిమందు తాగానని శ్రీనివాస్ కుటుంబసభ్యులకు తెలపడంతో భార్య లావణ్య ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్సఅందిస్తుండగా శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. శ్రీనివాస్‌భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అధిక వడ్డీకి అప్పు ఇస్తున్న వ్యక్తిపై కేసు

ఇల్లంతకుంట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన గడ్డమీది వెంకటేశంపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం వెంకటేశం గ్రామంలో అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నాడనే సమాచారం మేరకు శనివారం ఇంటిలో సోదా చేశామన్నారు. ఇంటిలో ప్రామిసరీ నోట్స్ బాండ్‌లతోపాటు విలువైనపత్రాలు లభించినట్లుతెలిపారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

జమ్మికుంటరూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నంకోసం తనఅత్తింటి వారు వేధిస్తున్నారని ఓవివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం ఐదు గురిపై కేసు నమోదుచేశారు. పోలీసులుతెలిపిన వివరాలప్రకారం.. జమ్మికుంట మండలం వావిలాల గ్రామానికిచెందిన ప్రనూషకు 2017లో మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్‌కు చెందిన వెలగందుల రాజేష్‌తో పెద్దలసమక్షంలో వివాహం జరిగింది. వివాహం జరిగిన మూడు నెలలుపాటు కలిసిమెలిసిఉన్నారు. అనంతరం రాజేష్ మరొకమహిళతో వివాహేతర సంబం ధం ఏర్పరుచుకున్నాడు. అప్పటి నుంచి తన భర్తతోపాటు అత్తవిజయలక్ష్మి, మామ సత్యనారాయణ, ఆడపడుచు అరవపల్లి లావణ్య, ఆడపడచుభర్త కిషోర్ అదనపుకట్నం తేవాలని వేధిస్తున్నారని ప్రనూష పేర్కొంది. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి



బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో ముందస్తు అడ్మిషన్లుచేస్తే కేసులు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్నివిద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయని ఆకళాశాలల్లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు విడుదల చేయాలన్నారు. అధికారుల వత్తాసు వల్లే విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. సమావేశంలో జిల్లాకార్యదర్శి మచ్చరమేష్, నగరకార్యదర్శి మామిడిపల్లి హేమంత్, సందీప్‌రెడ్డి, వినయ్, అశోక్ పాల్గొన్నారు.

అక్షర చిట్‌ఫండ్స్ మోసానికి ఏజెంట్ బలి

- ఎఫ్‌డీ, చిట్ డబ్బులు రాక ఆత్మహత్య
- న్యాయం చేయాలంటూ చిట్‌ఫండ్స్ బాధితుల ధర్నా



ఆందోళన చేస్తున్న అక్షర చిట్ ఫండ్స్ బాధితులు



రాజు (ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో అక్షర చిట్ ఫండ్స్ మోసానికి ఆసంస్థ ఏజెంట్ బలయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు, చిట్‌ఫండ్స్ బాధితులు, పోలీసులుతెలిపినవివరాల ప్రకారం... కరీంనగర్‌జిల్లా కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన చింతలరాజయ్య అలియాస్ రాజు (39) అక్షర చిట్‌ఫండ్స్‌లో కొన్నేళ్లుగా ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. రాజయ్య స్వంతంగా చిట్‌వేయటంతోపాటు బంధువులు, పరిచయస్థులతో చిట్స్ వేయించాడు. చిట్ డబ్బులు ఇవ్వకుండా తనకు రావాల్సిన 5లక్షల రూపాయలకు ఎక్కువ వడ్డీ చెల్లిస్తామని నమ్మబలికి చిట్‌సంస్థ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకుంది.గడువుముగిసినా డబ్బులు అందకపోవడంతో రాజయ్య ఆర్థికంగా నష్టపోయాడు. 5లక్షల కోసం అక్షర చిట్‌ఫండ్స్ చుట్టూ రెండేళ్లుగా తిరిగాడు. మరోవైపు రాజయ్యద్వారా చిట్ వేసినవారికి కూడా ఆసంస్థ డబ్బులు చెల్లించకుండా మోసంచేసింది. ఈ విషయాన్ని తన భార్యకు తరచుగా చెబుతూ బాధపడేవాడు. ఇదే విషయాన్ని తలుచుకుంటూ మనోవేదనతో శుక్రవారం అర్ధరాత్రి ఇంటివద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య వేకువజామున భర్తకోసం వెతకగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు. అక్షర చిట్‌ఫండ్స్ డబ్బులు చెల్లించక పోవటంతో ఆర్థికంగా నష్టపోయిన తన భర్త కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్యలావణ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. రాజయ్య ఆత్మహత్య విషయం తెలుసుకున్న అక్షరచిట్‌ఫండ్స్ బాధితులు పెద్దఎత్తున కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని అక్షర చిట్‌ఫండ్స్ సంస్థపై చర్యలు తీసుకుని తమకు రావాల్సిన డబ్బులను ఇప్పించి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అక్షరచిట్‌ఫండ్స్ బాధితులు గంప జగన్, గెల్లు ఐలయ్య యాదవ్ తదితరులు మాట్లాడుతూ అక్షర చిట్‌ఫండ్స్‌సంస్థ చిట్‌గడువు ముగిసినప్పటికీ తమకు రావాల్సిన డబ్బులు చెల్లించకుండా ఒత్తిడితెచ్చిన వారికి ఖాళీ చెక్కులు ఇచ్చి రెండేళ్లయినా చెల్ల కుండా పోయాయన్నారు. ఈ క్రమంలోనే ఏజెంట్ చింతల రాజయ్య తన 5 లక్షల డిపాజిట్ డబ్బులు, చిట్ డబ్బుల కోసం ఎంత ప్రయత్నించినా రాకపోవటంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని వాపోయారు.

● ప్రజల సొమ్ముతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం

అవసరాలకు ఉపయోగపడుతాయని ప్రతినెలా పొదుపు చేస్తూ అక్షర చిట్స్‌లో రిటైర్డ్‌ఉద్యోగులు, వికలాంగులు, వితంతువులు, చిరువ్యాపారులు చిట్‌వేసి బాధితులుగా మిగిలారు. మొదట చిట్ వేయించుకున్న అనంతరం వారికి డబ్బులు చెల్లించకుండా అధిక వడ్డీతో నమ్మబలికి అక్షర టౌన్‌షిప్ పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకుని గడువు ముగిసినా డబ్బులు చెల్లించకుండా మోసం చేశారు. కాళ్లు అరిగేలా తిరిగినవారికి అక్షర టౌన్‌షిప్ పేరిట చెక్‌లు ఇవ్వగా అవికూడా చెల్లకుండా పోయాయి. చివరకు కొందరికి అక్షర టౌన్‌షిప్‌లో స్థలాలను 4 రెట్లకు లెక్కచేసి అంటగట్టారు. అక్షర చిట్‌ఫండ్స్ సంస్థకు తెలంగాణ వ్యాప్తంగా 65 బ్రాంచిలు ఉన్నాయి. ఒక్కో బ్రాంచిలో 50 నుంచి 60కోట్ల వరకు చిట్ సభ్యులకు బాకీ ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. కరీంనగర్‌పోలీస్‌కమిషనర్ ఆదేశాలతో కరీంనగర్ జిల్లాలోని రెండు చోట్ల 14కోట్ల రూపాయల ఆస్తులను ఇటీవల ప్రభుత్వం అటాచ్‌మెంట్‌కు ఆదేశాలు జారీచేసింది. వరంగల్, ఖమ్మం ఇతర చోట్ల ఉన్న ఆస్తులను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పేలుళ్లతో దెబ్బతింటున్న పంటలు

- డి2 కాలువ నిర్మాణ పనులతో ఇబ్బందులు పడుతున్నరైతులు
- హద్దులు దాటి పొలాల్లోకి మట్టి
- ఆందోళన వ్యక్తం చేస్తున్నరైతులు
- పట్టించుకోని అధికారులు



నాగిరెడ్డిపూర్‌లో లింక్2 కాలువ తవ్వకాలు

హద్దు దాటి పొలాల్లోకి వచ్చిన మట్టి

గంగాధర, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో నాగిరెడ్డిపూర్ డీ-2కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా చేపడుతున్న పేలుళ్లతో సమీప పొలాల రైతులు భయాదోళనకు గురవుతున్నారు. కాలువలో బండ రాళ్లను పగులగొట్టేందుకు ఉపయోగిస్తున్న భారీ పేళు ల్లతో రాళ్ల ఎగిరిపడి సమీప పంటపొలాలు ధ్వంసమవుతున్నాయి. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ వరదకాలువ నుంచి రామడుగు మండలం దత్తోజిపేట మీదుగా చొప్పదండి వరకు లింకు2 కాలువ నిర్మిస్తున్నారు. కాలువలో తీసిన మట్టిని ఒడ్డుపై పోస్తున్నారు. కాలువకు భూములిచ్చిన హద్దులు దాటి మూడు మీటర్ల వరకు రైతుల పొలాల్లో మట్టిని పోస్తుండగా తీవ్రంగా నష్టపోతున్నామని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో బండరాళ్ల పగుళ్లకు చేపట్టే పేలుళ్లతో రాళ్ల ఎగిరి వచ్చి పచ్చని పంటలు నాశనమవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరిపొలాలు పొట్ట దశలో ఉండగా రాళ్ల పడి కర్రలు విరిగి పోతున్నాయని రైతులు తెలిపారు. ఈ విషయంపై నీటి పారుదల శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. పేలుళ్లకు పొలాలకు నీరు పెట్టా లన్నా, ఎరువులు చల్లాలన్నా భయంగా ఉందని రైతులు వాపోతున్నారు. తమ బాధను ప్రశ్నిస్తే కాలువ తవ్వే వారు బెదిరిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పేలుళ్ల దాటి నుంచి పొలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

రాళ్లు పడటంతో.. భూమిని బీడుగానే వదిలేశా..



\- పంజాల వేణు, రైతు, నాగిరెడ్డిపూర్


నాకు ఇక్కడ మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. నా భూమి మధ్య నుంచి కాలువ తవ్వుతున్నారు. బ్లాస్టింగ్‌తో రాళ్లు పడుతుండగా భూమిని దున్నకుండానే ఒకవైపు వదిలేశా. అటువైపు నీరున్న చోట పొలం వేయగా పేళుళ్ల దాటికి పంటపొలాల్లో రాళ్లు పడి కర్రలు విరిగిపోయి నష్టపోతున్నాం. అధికారులు పట్టించుకుని పొలాలను కాపాడాలి.

రైతులకు నష్టం జరగకుండా చూస్తాం..

\- రఘురాం, ఏఈ నీటిపారుదల శాఖ

నాగిరెడ్డిపూర్ డి2 కాలువ నిర్మాణంలో రైతులకు నష్టం జరగకుండా చూస్తాం. మట్టి పోస్తుండగా కొంతజారి పొలంలో పడుతుందని రైతులు నా దృష్టికి తీసువచ్చారు. పొలాల్లో పడిన మట్టిని తీసివేయించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూస్తాం.

అల్లాడుతున్న అన్నదాతలు



చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో ఎండిపోయిన వ్యవసాయ బోరు

ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాలో ఎండిపోయిన వరి పైరును మేస్తున్న పశువులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వరిసాగు చేసిన రైతులకు ఆదిలోనే అరిగోస తప్పడం లేదు.

- అడుగంటిన భూగర్భ జలాలు..
- అందని సాగునీరు
- పంటలను కాపాడాలని రైతుల వేడుకోలు

భూగర్భ జలాలు అడుగంటడంతో ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, గుంటపల్లిచెరువుతండా, దేవునిగుట్టతండా తదితర గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయి. పంటలకు సాగు నీరు అందించేందుకు ఇటీవల కోనరావుపేట మండలం మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసినా నాలుగు రోజులకే నిలిచిపోయింది. దాంతో ఆయా గ్రామాల్లోని సుమారు 2500ఎకరాల విస్తీర్ణంలో వరి పంటలు పగుళ్లు చూపాయి. మరో 2500 ఎకరాల్లో ఎండిపోయాయి. కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే కాపాడుకునేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోని గ్రామాల్లో నీటి వనరులు, వ్యవసాయ బోరుబావులపై ఆధారపడి సుమారు 4వేల మంది రైతులు మొత్తం 16,850 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను సాగు చేశారని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఎంతో ఆశతో సాగు చేసిన వరి పంటలకు సాగు నీరందకపోవడంతో ఆదిలోనే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి పంటలు పగుళ్లు చూపగా, మరో 2వేల ఎకరాల్లో ఎండిపోయాయి. మిగిలిన పంటలను రక్షించుకునేందుకు రేయింబవళ్లు పొలాలకు తడులు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగునీటిని అందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

పొలమంతా పగుళ్లు చూపింది



- భూక్య మహేశ్, యువ రైతు, దేవునిగుట్టతండా

మాకున్న మూడెకరాల్లో రూ.60వేలు బాకీలు చేసి వరి పంట వేశా. ఉన్న ఒక్క బోరుతో మూడెకరాలు పారేది. ఇప్పుడు నీళ్లు అందడం లేవు. పది రోజుల నుంచి పంటంతా పగుళ్లు చూపుతోంది. మరో వారం రోజుల్లో సాగు నీరు పెడితే పంట చేతికొస్తది. ఇప్పటికైనా అధికారులు స్పందించి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీరు అందించి పంటలను కాపాడాలే. చేసిన అప్పులు తీర్చే మార్గం కానరావడం లేదు.

15 ఏళ్లయినా వరద కాలువ పనులు పూర్తి కాలేదు

-తళ్ల నరేష్, ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్

నాడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన వరద కాలువ పనులు నిలిచి పోయాయి. 15 సంవత్సరాలు గడిచినప్పటికీ పూర్తి కాలేదు. మండలంలోని అన్ని గ్రామాలకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మామిడి తోటలకు కూడా నీరు అందడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వరదకాలువ పనులు పూర్తి చేసి మండలంలోని అన్ని గ్రామాల రైతులకు సాగు నీరు అందేలా చూడాలి. లేదంటే పంటలపై పెట్టుబడులు పెట్టి రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారు.

పశువులకు మేతగా వదిలేశా..



- భూక్య హుస్సేన్, రైతు, దేవునిగుట్టతండా

నాకున్న ఆరెకరాల్లో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నా. గత రెండేళ్లలో రూ.4 లక్షల అప్పులు చేసి మూడు బోర్లు వేయించా. నీళ్లు మంచిగనే పడినయ్. బోర్లలో నీళ్లు ఉన్నాయని ఆరు ఎకరాల్లో రూ.1.20 లక్షల పెట్టుబడి పెట్టి వరి పంట వేశా. నెలకే బోర్లు ఎత్తేసినయ్. చిన్న ధారలా వస్తున్న నీళ్లతో తడులు పెడుతున్నా. మూడెకరాలకు సాగు నీరు అందక ఎండిపోయింది. పొలం ఎండిపోవడంతో పశువుల మేతకు వదిలేశా. బోర్లు, పంట పెట్టుబడికి రూ. 5.20 లక్షల దాకా బాకీల పాలయ్యా. ప్రభుత్వమే ఆదుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి

- బొల్లోనిపల్లి ఎల్లవ్వ, రైతు, చిగురుమామిడి

బావుల్లో పూడిక తీయడానికి ప్రభుత్వం ఆదుకోవాలి. నాకున్న రెండు ఎకరాల భూమిలో వరి వేశాను. కనీసం ఇంకా నెలరోజులైనా నీళ్లు అవసరం ఉంది. సాగునీరు అందకపోవడంతో బావిలో పూడిక తీస్తున్నా. నీరులేక ఎండిన పంటలకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలి. కాలువ నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

పశుగ్రాసంగా మారుతున్న పంటలు..

● సాగునీరు అందక ఇబ్బందులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి, బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, నవాబుపేట, చిగురుమామిడి, లంబాడిపల్లి తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండుతున్నాయి. దీంతో చేసేదేం లేక రైతులు పంట పొలాలను పశుగ్రాసంగా వాడుతున్నారు. మెట్ట ప్రాంతంగా ఉన్న చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి. రేకొండ, చిన్నముల్కనూర్, ఓగులాపూర్, పీచుపల్లి గ్రామాలకు మాత్రమే సాగు నీరు వస్తోంది. ఎండలు ముదురడంతో భూగర్భ జలాలు అడుగంటి సాగునీరు అందడం లేదు. పొలాలకు దాదాపు రెండు నెలలు సాగునీరు అందాల్సి ఉన్నది. పెట్టుబడి పెట్టి పంట సాగు చేసిన రైతులు అప్పులు తీసుకొచ్చి బావుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. మండలంలో చాలా గ్రామాలకు సాగునీరు అందడం లేదు. మామిడి తోటలకు ప్రైవేటు ట్యాంకర్ల నీరు అందిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి కాకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో చేపట్టిన పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



ట్యాంకర్‌తో మామిడి తోటకు నీరు పెడుతున్న రైతు

అందని ఎస్సారెస్పీ నీరు

మంథని/మంథనిరూరల్ : అందని సాగునీరు, మండుతున్న ఎండలతో మంథని ప్రాంతంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వేసవికాలంలో ముదురుతున్న ఎండలకు తోడు సాగునీరు సైతం అందక ఇప్పటికే వందల ఎకరాల్లో వరి పొలాలు బీటలు వారాయి. యాసంగి సాగులో వివిధ గ్రామాల్లోని వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ముంచుకొస్తుంది. మరోతడికి సాగునీరు విడుదల చేయకపోతే అన్నదాతలు నిండా మునిగే ప్రమాదం ఉంది. మండలంలోని కాకర్లపల్లి, సూరయ్యపల్లి, ఎక్లాస్‌పూర్ వంటి ఎస్సారెస్పీ కెనాల్ చివరి ఆయకట్టు గ్రామాల్లో సాగునీరు అందక వందలాది ఎకరాల్లో వరి పంటలు బీటలువారుతున్నాయి. దాదాపు నెలరోజుల క్రితం ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా సాగునీరు విడుదల చేసిన అధికారులు ఆతర్వాత ముఖం చాటేశారు. ఓవైపు ఎండలు ముదురుతుండటం, మరోవైపు కెనాల్‌లో సాగునీరు విడుదల చేయకపోవడం, బోర్లలో సైతం సరిపడా నీరు అందడం లేదు. మరో 15 రోజులు ఇలానే కొనసాగితే పంటలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు ఇప్పుడిప్పుడే పొట్టదశకు చేరుతున్నాయని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా మరో తడికి నీరు అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



కాకర్లపల్లి గ్రామ శివారులో బీటలువారుతున్న పంట పొలాలు

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

వెల్గటూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడిపల్లి గ్రామంలో మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం స్వామి వారి సుప్రభాత సేవ, స్వస్తివచనం, ఆవాహిత మంటప దేవతాపూజలు నిర్వహించారు. వివిధ ఔషధ సుగంధాది స్నపనములు, బింబ శుద్ధి కార్యక్రమాలు అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. శ్రీదేవిసహిత రుద్ర హోమము నిర్వహించిన అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మూర్తి హోమము, మూల మంత్ర హోమము, కళాహోమము నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పైడిపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



తాట్లవాయిలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

● తాట్లవాయిలో..

రాయికల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాట్లవాయి గ్రామంలోగల సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయంలో సీతారామ, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలతో పాటు సంతాన నాగప్రతిష్ఠ, ఏకశిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రంగాచార్యులు, మురళి, మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామిని భక్తులు దర్శనం చేసుకున్నారు. అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు.. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంప త్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

కోనరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో శనివారం పోచమ్మ తల్లి, దుర్గాంబిక దేవతల బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి పోచమ్మ, దుర్గమ్మ తల్లులకు బోనాలతో డప్పుచప్పుల మధ్య వెళ్లి నైవేద్యం చెల్లించారు. కుటుంబసభ్యులు, పాడిపంటలు బాగుండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అనిల్, ఆనంద రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, దుర్గారెడ్డి, లచ్చిరెడ్డి, బాపురెడ్డి, మాజీ సర్పంచ్ జిన్నా అనిల్, ఉప సర్పంచ్ కిషన్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



దేవస్థానం హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్ర సమీపంలో గల అక్కపల్లి రాజరాజేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హుండీ ద్వారా రూ 1,98,319 ఆదాయం లభించింది. అలాగే 11 విదేశీ నోట్లు లభించాయి. ఈ సంవత్సరం కళ్యాణం టిక్కెట్ల ద్వారా 1,82,000, ఇతర టిక్కెట్ల ద్వారా 60,574, హుండీల ద్వారా 1,98,319 మొత్తం ఆదాయం రూ 4,40,893 లభించింది. గత ఏడాది కన్న రూ 19,206 అధికంగా ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఎండోమెంట్ జగిత్యాల ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు బూస ప్రవీణ్‌కుమార్, జన్మంచి శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్ సీపతి సత్యనారాయణ, గడ్డం భాస్కర్‌రెడ్డి, సంగి ఆనంద్, గడ్డం బోజిరెడ్డి, గంగారెడ్డి, రాజయ్య, తిరుమల సేవా గ్రూప్ కరీంనగర్ సభ్యులు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లీపూర్‌లో రాజరాజేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయికల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో రాజరాజేశ్వర స్వామి రథోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా పురోహితులు అంగడి భువనేశ్వర్, అంగడి పరమేశ్వర్, గురులింగ మఠం వినయ్‌కుమార్, గురు లింగమఠం విక్రమ్‌ల మంత్రోచ్ఛరణల మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మోర విజయలక్ష్మివెంకటేష్, బాలె చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, జగిత్యాల రూరల్ సీఐ చిట్యాల భూమయ్య, నామని లక్ష్మీనర్సయ్య, సుమన్, శేఖర్, ప్రసాద్, శ్రీను, వేణురావు, రాజం పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా విడుదలకు సీఎం ఆదేశం

- టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ మంద భీం రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తుందన్నారు. రాష్ట్రంలో 94 మంది బాధిత కుటుంబ సభ్యుల ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా సొమ్ము జమ చేయడానికి నిర్ణయం తీసుకోగా అందులో జగిత్యాల జిల్లాలో 31 మంది బాధిత కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా అందనుందన్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకునేలా రూ. 5 లక్షల పరిహారం నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులకు భీంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రంలోకి నంబర్-1 గేట్ నుంచి అనుమతి

- ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి

కరీంనగర్ క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈ నెల 3న కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లే కౌంటింగ్ ఏజెంట్లు, క్లరికల్ సిబ్బంది, మీడియా ప్రతినిధులకు అంబేద్కర్ స్టేడియం గేట్ నంబర్-1 నుంచి ప్రవేశానికి అనుమతిస్తారని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ బి యాదగిరి స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టేడియంలోకి ప్రవేశించిన వారు నిర్దేశించిన ప్రాంతంలో వాహనాలను పార్క్ చేసి గేట్‌నంబర్ -4 ద్వారా ఇండోర్ స్టేడియంలోకి అనుమతిస్తారని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా చర్యల్లో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రతాపరమైన చర్యలకు అందరూ సహకరించాలని కోరారు.

బాబ్లీ గేట్లు ఎత్తివేత

- గోదావరిలోకి

0.6 టీఎంసీల నీటి విడుదల

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను శనివారం అధికారులు తెరిచారు. ప్రాజెక్టు నుంచి 0.6 టీఎంసీల నీటిని దిగువన గల గోదావరిలోకి విడుదల చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం తాగునీటి అవసరాల కోసం ఒక రోజు నీటిని విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలో గోదావరి నదిపై బాబ్లీ ప్రాజెక్టు నిర్మిస్తున్న సమయంలో ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో పిటీషన్లు వేయడంతో సంబంధిత ఉత్తర్వులు వచ్చాయి. దీని ప్రకారం ప్రతీ సంవత్సరం జూలై 1వ తేదీ నుంచి అక్టోబరు 29వ తేదీ వరకు బాబ్లీ నుంచి అధికారులు నీటిని విడుదల చేస్తుంటారు.

వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడిని ఎదుర్కొవడానికి మార్చి 1న ఒక రోజు నీటిని విడుదల చేస్తారు. ఈ మేరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఉదయం 9.30 గంటలకు ఐదు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటి విడుదలను ప్రారంభించారు. 0.6 టీఎంసీల నీరు విడుదల కాగానే తిరిగి గేట్లను మూసివేస్తారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వర్లు, చక్రపాణి, ప్రశాంత్, కొత్త రవి, సచిన్, విన్యాస్, సుశాంత్, రిక్కి, పలువురు బాబ్లీ ప్రాజెక్టు, ఎస్సారెస్పీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బాబ్లీ ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు విడుదల అవుతున్న నీరు

కరాటేలో సత్తాచాటుతున్న విద్యార్థులు

మంథని, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరిగిన పలు కరాటే పోటీల్లో జపాన్‌కరాటే అసోసియేషన్ (జేకేఏ) మంథని షోటోకాన్ విద్యార్థులు సత్తాచాటుతున్నారు. 15 సంవత్సరాలుగా మంథనికి చెందిన కోచ్ కొండ్ర నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు సాధన చేస్తూ ఎస్‌జీఎఫ్, సీఎం కప్, ఇంటర్ యూనివర్సిటీస్ స్థాయిల్లో, వివిధ కరాటే అసోసియేషన్స్ నిర్వహించే జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో మెడల్స్ సాధిస్తున్నారు. ఆరేళ్ళుగా ఎస్‌జీఎఫ్ పోటీల్లో కరాటే క్రీడను చేర్చగా ఇప్పటి వరకు మంథని షోటోకాన్ నుంచి 20 మంది విద్యార్థులు నేషనల్స్‌కు ఎంపికయ్యారు. స్థానిక ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో నిత్యం ఉదయం, సాయంత్రం కోచ్ కొండ్ర నాగరాజు శిక్షణ ఇస్తున్నారు.

ఎస్‌జీఎఫ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు

గతేడాది డిసెంబర్‌లో న్యూఢిల్లీలో జరిగిన ఎస్‌జీఎఫ్‌లో జాతీయ స్థాయి పోటీలో పాల్గొనడానికి నలుగురు విద్యార్థులు అర్హత సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ సత్తాను చాటి జాతీయ స్థాయిలో జరిగిన అండర్-17లో కుముతీవింగ్‌లో బేర ఆదిత్యతేజ, తోట హాసిని, పొట్ల శ్రావణ్‌కుమార్, రంగు శ్రీచరణ్ ప్రతిభను చాటారు.

గోదావరిఖనిలో జరిగిన ఎస్‌పీఎఫ్ జిల్లా స్థాయి పోటీల్లో 12 మంది విద్యార్థులు పాల్గొనగా ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు 9 మంది ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలో పాల్గొన్న 9 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు సెలక్ట్ అయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో నలుగురు నేషనల్ పోటీలకు సెలెక్ట్ అయ్యారు. రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు వివిధ కరాటే ఆర్గనైజేషన్లకు చెందిన దాదాపు 300 పైగా విద్యార్థులు పాల్గొనగా వీరిలో 21 మంది నేషనల్ పోటీలకు ఎంపిక కాగా వారిలో 4 మంథని విద్యార్థులు ఉన్నారు.

● ఎస్‌జీఎఫ్ నేషనల్స్‌లో బ్రాంజ్ ● సీఎం కప్‌లో సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులు


ఎస్‌జీఎఫ్ నేషనల్స్‌లో పాల్గొన్న విద్యార్థులు, సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఇంటర్ యూనివర్సిటీస్ స్థాయిలో బాబీవర్మ



జాతీయ, రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో రాణిస్తున్న బీబావర్మ ఇంటర్ యూనివర్సిటీ, ఆలిండియా స్థాయి కరాటే పోటీల్లో మెడల్స్‌ను సొంతం చేసుకుంటున్నాడు. ఇంటర్ యూనివర్సిటీస్ స్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో మైనస్-60 కేజీ విభాగంలో పైడిపాటి బాబీవర్మ గోల్డ్‌మెడల్ సాధించారు. ఇదే పోటీల్లో మైనస్-56 కేజీ విభాగంలో కంకణాల పవన్ పాల్గొన్నారు. ఆలిండియా యూనివర్సిటీ గేమ్స్‌లో సైతం ఇదే క్యాటగిరిలో బాబీవర్మ సిల్వర్ మెడల్ సాధించారు.

సీఎం కప్‌లో బ్రాంజ్ మెడల్ సొంతం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఎం కప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఇద్దరు విద్యార్థులు మెడల్స్ సాధించారు. బాబీవర్మ సిల్వర్ మెడల్ సాధించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నగదు రూ. 10వేల ప్రోత్సాహానికి ఎంపికయ్యారు. డుల్‌గచ్ దేవాన్ష్ బ్రాంజ్ మెడల్ సాధించి 10 వేలు క్యాష్ ప్రైజ్ గెలుచుకున్నారు. సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు దొంతుల సాయిదివ్యతేజస్వీని, బొడ్డెల ఇంద్రానీ, తోట హసినీ, పైడిపాటి బాబీవర్మ, బేర ఆదిత్య తేజ, పొట్ల శ్రావణ్‌కుమార్, రంగు శ్రీచరణ్, డుల్‌గచ్ దేవాన్ష్, తంబూరి రోహిత్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ తోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఇంటర్నేషనల్ పోటీల్లో రాణిస్తాం
కొండ్ర నాగరాజు, కోచ్, మంథని



ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో మంథని విద్యార్థులు రాణించే విధంగా కోచింగ్ ఇస్తున్నాం. ఇప్పటికే ఎస్‌జీఎఫ్ తోపాటు ఇతర కరాటే ఆర్గనైజేషన్లు నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు సత్తా చాటి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఇలా క్రమశిక్షణతో కరాటే సాధన చేస్తూ మెడల్స్ సాధించడం కోచ్ నాకు గర్వంగా ఉంది.

ఎస్‌జీఎఫ్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది
శీనివాస్, ఎస్‌జీఎస్ జిల్లా కార్యదర్శి

ఎస్‌జీఎఫ్-24 నేషనల్స్‌కు కరాటే విభాగానికి పెద్దపల్లి జిల్లా నుంచి మంథనికి చెందిన షోటోకాన్ కరాటే విద్యార్థులు నలుగురు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. రాష్ట్రం నుంచి 21 మంది నేషనల్స్ సెలెక్ట్ కాగా వారిలో జిల్లా నుంచి నలుగురు మంథని విద్యార్థులు ఉన్నారు. కోచ్ నాగరాజు విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కఠోరంగా కరాటే విద్యను సాధన చేయిస్తుండటంతో వారు జాతీయ, రాష్ట్ర పోటీల్లో మెడల్స్ సాధిస్తున్నారు.

విద్యార్థుల్లో ఆత్మస్థయిర్యాన్ని నింపుతున్న కరాటే


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఆత్మస్థయిర్యంతో ముందడుగు వేయాలని, వారిలో ఆత్మరక్షణ పెంపొందించేందుకు కరాటేలో శిక్షణ ఇస్తున్నారు. పెద్దాపూర్ గ్రామానికి చెందిన సంకెండ్ల లక్ష్మీనర్సయ్య అనే షాటోకాన్ కరాటే మాస్టర్ విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నాడు. కొన్నేళ్లుగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కరాటే క్రీడలపై శిక్షణ ఇస్తూ విద్యార్థులలో ఆత్మస్థయిర్యాన్ని నింపుతున్నాడు. రోజు ఆయా పాఠశాలల్లో కరాటే క్రీడల్లో శిక్షణ ఏర్పాటు చేస్తున్నాడు. కరాటే నేర్చుకునేందుకు విద్యార్థినులు, యువకులు ఆసక్తి చూపుతున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి
లక్ష్మీనర్సయ్య, కోచ్

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 20 ఏళ్ళుగా విద్యార్థులు, యువతీ, యువకులకు కరాటేలో శిక్షణ ఇస్తున్నా. కరాటే శిక్షణలో తక్కువ పారితోషికం తీసుకుంటూ వారు నైపుణ్యం సాధించేలా కృషిచేశా. రాష్ట్ర ప్రభుత్వం తనకు ప్రోత్సాహం కల్పిస్తే మరింతగా విద్యార్థులను కరాటేలో తీర్చిదిద్దుతాను.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

మంథని, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మంథని నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రజలు అవకాశం ఇచ్చినా ఆ దిశగా అడుగులు ముందుకు వేయకపోతే చరిత్ర హీనులుగానే మిగిలిపోతారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఇప్పటికే ఎమ్మెల్యేకు లేఖ పంపానని, తాజాగా మరో బహిరంగ లేఖ పంపిస్తున్నట్లు శనివారం పుట్ట మధు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యేగా ప్రజల తరుపున బాధ్యతలను గుర్తు చేస్తూ లేఖ రాసినట్లు తెలిపారు. సీఎంకు పక్కనే ఉంటూ సలహాలు ఇచ్చే మంథని ఎమ్మెల్యే, మంత్రికి నియోజకవర్గంలో అభివృద్ధిపై ఎందుకు దృష్టి పెట్టడం లేదన్నారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తి చేస్తానన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ పై కుట్రలను మానుకొని ప్రాజెక్టు మరమ్మతు బాధ్యతలను తీసుకోవాలన్నారు. మంథని, కాటారంలో నిరుద్యోగుల కోసం మినీ ఐటీ సెంటర్లు ఏర్పాటు చేయాలని, పోతారం లిఫ్ట్‌ను పూర్తి చేయాలన్నారు. మానేరు పై ఓడేడ్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయించాలన్నారు. ఏగోళపు శంకర్‌గౌడ్, కాయితీ సమ్మయ్య, పుప్పాల తిరుపతి, గట్టయ్య, కుమార్, రాజబాబులు పాల్గొన్నారు.

టాస్క్‌ద్వారా శిక్షణకు రిజిస్ట్రేషన్లు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ద్వారా వివిధ కోర్సుల శిక్షణకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం అవుతున్నాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒకప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించుటకు జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు టాస్క్ కేంద్రానికి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని, టాస్క్ ఆఫీసులో సంప్రదించాలన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి


వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం

కోల్‌సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అపారమైన మేధాశక్తి, సృజనాత్మకత దాగి ఉంటుందని ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స అన్నారు. శనివారం ఆర్‌ఎఫ్‌సీఎల్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో నిర్వహించిన సైన్స్ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అపారమైన శక్తి, సామర్థ్యాలు ఉంటాయని, ఉపాధ్యాయులు వారిలో దాగి ఉన్న మేధస్సును, సృజనాత్మకతను గుర్తించి భవిష్యత్‌కు బంగారు బాట వేయాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడం వల్ల భవిష్యత్‌లో కొత్త ఆవిష్కరణకు దోహదపడుతాయన్నారు. అనంతరం క్యాట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ రవి, ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు సాహు, రమేష్ ఠాకూర్, డీన్ రమేష్, ప్రశాంతి, ఏఓ నరేందర్‌కుమార్, స్రవంతి పాల్గొన్నారు.

న్యాయ సేవలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి


ప్రసంగిస్తున్న జిల్లా జడ్జి టి.శ్రీనివాస్ రావు

జ్యోతినగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు న్యాయసేవలు, చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయమూర్తి టి.శ్రీనివాస్‌రావు అన్నారు. మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. సచ్‌దేవ పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జడ్డి ప్రసంగిస్తూ విద్యార్థి దశ నుంచే కోర్టులు, విధులు, న్యాయ సేవల గురించి తెలుసుకోవాలన్నారు. బాధితులు, కక్షిదారులకు న్యాయపరమైన సహాయాన్ని అందించేందుకు అవసరమైన వ్యవస్థలున్నాయన్నారు. జిల్లా జడ్జి శ్రీనివాస్ రావును పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చంద్, విద్యార్థు లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్

పెద్దపల్లిటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు బీమోజు సురేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లోజు రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వం చేయూత అందించాలని కోరారు. కొన్నేళ్ళుగా నిరాదరణకు గురవుతున్న విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ముల్కల గోవర్ధన్ శాస్త్రిని పెద్దపల్లి యూత్ అధ్యక్షుడిగా నియమించారు. సమావేశంలో రాజ్యలక్ష్మి, ప్రసాద్, ఆంజనేయులు, రాజేందర్, నర్సింహ చారి, సాయి చరణ్, వీరాచారి, వైకుంఠచారి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్గాం ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

కోల్‌సిటీటౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అంతర్గాం ఎస్ఐ వెంకటస్వామి పోలింగ్ కేంద్రంలో బీజేపీ ఏజెంట్లను బెదిరించి వెళ్ళగొట్టారని, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని సీపీ శ్రీనివాస్‌ను బీజేపీ రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి కోరారు. శనివారం సీపీకి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. పోలింగ్ కేంద్రంలోకి కాంగ్రెస్ కార్యకర్తలు సెల్‌ఫోన్‌తో అనుమతించారని పేర్కొన్నారు. పోలింగ్ ఆఫీసర్ వారించినా పట్టించుకోకుండా బీజేపీ పోలింగ్ ఏజెంట్లకు ఫోన్ ఇవ్వడంతో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ బీజేపీ ఏజెంట్లను బెదిరింపులకు గురిచేయడంతో వెళ్లిపోయారన్నారు. ఎస్ఐ వెంకటస్వామి, కానిస్టేబుల్ రాజేందర్ కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరించి బీజేపీ నాయకులను అడ్డుకున్నారన్నారు. మండల అధ్యక్షుడు సుభాష్, మిట్టపల్లి సతీష్, గుండోయిన భూమయ్య, నాయకులు అంజి, మాడ అనిల్‌రెడ్డి, కందుల పోచం ఉన్నారు.

సిమ్స్‌లో సీపీడీ ప్రోగ్రాం

కళ్యాణ్‌నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో శనివారం కంటిన్యూ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్(సీపీడీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాలలోని 150మంది వైద్యులు పాల్గొన్నారు. వైద్యులు అప్‌గ్రేడ్ కావడానికి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఆర్‌జీ-1లో 110శాతం ఉత్పత్తి



గోదావరిఖని, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1లో ఫిబ్రవరిలో 110శాతం ఉత్పత్తి సాధించినట్టు ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్ శనివారం ఒక ప్రక టనలో తెలిపారు. 3.84లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 4.22 లక్షల టన్నులు సాధించామని తెలిపారు. ఉద్యోగులు, అధికారులు కలిసి కట్టుగా రక్షణతో పని చేసి ఉత్పత్తి సాధించినందునకు జీఎం అభినందించారు. అదే విధంగా వార్షిక ఉత్పత్తి లక్ష్యం 44.92లక్షల టన్నులకు గాను 42.21లక్షల టన్నులతో 94శాతం ఉత్పత్తి సాధించామని జీఎం వివరించారు. సింగరేణి సీఎండీ మార్గదర్శకాలతో ఈ నెల 19న జీడీకే 11ఇంక్లైన్ 2800టన్నుల రోజు వారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను రికార్డు స్థాయిలో 5600టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా సింగరేణి కాలనీలలో ఉద్యోగుల నివాసాలకు తాగు నీటి సమస్య తలెత్తే అవకాశాలు ఉన్నందున ఉద్యోగులు సహకరించి నీటిని పొదుపుగా వాడు కోవాలన్నారు.

ఆర్జీ-2 ఉత్పత్తి 99 శాతం


మాట్లాడుతున్న ఆర్జీ-2 జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా 99 శాతం ఉత్పత్తి సాధించినట్టు జీఎం బండి వెంకటయ్య పేర్కొన్నారు. శనివారం జీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఉత్పత్తి వివరాలను తెలిపారు. డివిజన్ టార్గెట్ 10.47 లక్షల టన్నులు కాగా 10.35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగినట్టు తెలిపారు. ఓసీపీ-3 టార్గెట్ 10.20 లక్షల టన్నులు కాగా 10.22 లక్షల టన్నులతో వంద శాతం ఉత్పత్తి జరిగిందని వెంకటయ్య పేర్కొన్నారు. వీకేపీ లక్ష్యం 27,700 టన్నులకు 12,198 టన్నులు సాధించి 44% ఉత్పత్తి సాధించామని జీఎం తెలిపారు. ఏరియా నుండి 7.39 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్టు తెలిపారు. మెరుగైన పనితీరు కనబర్చిన ఓసీపీ-3 ఉద్యోగులను అభినందిస్తున్నట్టు జీఎం తెలిపారు. ఏరియా ఇంజనీర్ నరసింహారావు, ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, అధికారులు ఎర్రన్న, మురళీకృష్ణ, ధనుంజయ, వెంకట రామచంద్రలు పాల్గొన్నారు.

ఆర్జీ-3 ఉత్పత్తి 104, ఏపిఏ ఉత్పత్తి 66శాతం

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపిఏ డివిజన్‌ల ఉత్పత్తి వివరాలను జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆర్జీ-3 డివిజన్ పరిధిలో ఫిబ్రవరి లో ఏరియాకు నిర్దేశించిన 5.44 లక్షల టన్నులకు గాను 5.64 లక్షల టన్నులు సాధించి 104 శాతంలో నిలిచాయని పేర్కొన్నారు. ఏపీఏ డివిజన్‌కు నిర్దేశించిన 0.18 లక్షల టన్నులకుగాను 0.12లక్షల టన్నులు 66 శాతం ఉత్పత్తిని సాధించినట్లు పేర్కొన్నారు. ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-1 ప్రాజెక్టుకు నిర్దేశించిన 2.74 లక్షల టన్నులకు గాను 2.93 లక్షల టన్నులు సాధించి 107 శాతంలో నిలిచిందన్నారు. ఓసిపి-2 ప్రాజెక్టు నిర్దేశించిన 2.70లక్షల టన్నులకు గాను 2.70 లక్షలు సాధించి వందశాతం లక్ష్యాలను సాధించిందన్నారు.

బీఎంఎస్ కృషి ఫలితంగా జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్ మార్పు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 1: (ఆంధ్రజ్యోతి): బీఎంఎస్ కృషి ఫలితంగా జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్‌లో మార్పు జరిగినట్టు సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ వడ్డెపల్లి కుమారస్వామి ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక గుర్తింపు, గౌరవప్రదంగా ఉండే విధంగా డిసిగ్నేషన్ మార్పు జరిగినట్టు తెలిపారు. జనరల్ మజ్దూర్ అనే హోదాపై చిన్నచూపు ఉండేదని తెలిపారు. యూనియన్ కోల్‌సెక్టార్ ఇంచార్జి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా ఫిబ్రవరి 6న రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో జరిగిన స్టాండర్డ్ డైజేషన్ కమిటీ సమావేశంలో కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాలతో డిసిగ్నేషన్ పేరు మార్పుపై చర్చించినట్టు కుమారస్వామి తెలిపారు. జనరల్ అసిస్టెంట్‌గా మార్చేందుకు కోల్ ఇండియా యాజమాన్యం అంగీకరించినట్టు కుమారస్వామి తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

రామగిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో దశలవారిగా ఆందోళన చేపడతామని సింగరేణి ఆల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌతంశంకరయ్య అన్నారు. శనివారం సెంటినరీకాలనీలోని రాణిరుద్రమాదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 11వ వేజ్‌బోర్డులో సవరణ చేయని కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వలేదనే కారణంతో వేల మంది కార్మికుల పెన్షన్ నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వేజ్‌బోర్డును తక్షణం సవరణ చేయాలన్నారు. అనంతరం పలు అంశాల పై చర్చించారు. రిటైర్డ్ కార్మిక నాయకులు పట్నం సత్యనారయణ, చెల్కల జవాహర్, యాకుబ్, సలీం, సమ్మయ్య, రాజేశం, కిష్టయ్య, లింగన్నపేట సత్తయ్య, ఐలయ్య, కొండపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

రామగిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపిఏ డివిజన్‌లలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకను విజయవంతం చేయాలని ఆర్జీ-3 సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకర్‌రావు అన్నారు. శనివారం సేవ భవనంలో సేవ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక కమ్యూనిటీ హాల్ ఉదయం జరిగే వేడుకల ఏర్పాట్లను చేపట్టాలని కోరారు. సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి సేవ సభ్యులు కృషి చేయాలని తెలిపారు. అధికారులు సుదర్శనం, గుర్రంశ్రీహరి, రాజేశం,సేవా కోఆర్డినేటర్ మల్లీశ్వరీ, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, కోఆర్డినేటర్ సుధాకర్, సేవా సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభించి మూడేళ్ళు పునాదులు దాటని పనులు

(5వ పేజీ తరువాయి)

వివిధ రకాల కూరగాయలు విక్రయించే రైతులు, పలు వ్యాపారులతో సంత రద్దీగా ఉంటోంది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సంతకు అధికసంఖ్యలో రావడం, రద్దీ ఉండడంతో దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. సెల్‌ఫోన్లు, మహిళల పర్సులను చోరీకి గురవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న కూరగాయల మార్కెట్‌కు వచ్చే వారికి సరైన పార్కింగ్ సదుపాయం లేదు. కనీస వసతులు లేక పోవడం, గత ప్రభుత్వ హయాంలో అధునిక వసతులు సౌకర్యాలను అందుబాటులోకి తెస్తూ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మార్కండయకాలనీ సమీపంలో స్థలాన్ని కేటాయించారు. ఒక్కచోటనే కూరగాయల విక్రయాలు, చేపల మార్కెట్, చికెన్, మటన్ వంటి విక్రయశాలలకు వేర్వేరుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆ పనులు కేవలం పునాదుల వరకే వచ్చి నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఎవరూ దాన్ని పూర్తి చేయడానికి ముందుకు రాలేదు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు

సుల్తానాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో విశ్వం ఎడ్యూటెక్, గామా ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్, వేదిక్ గణిత, స్పెల్‌బి రాష్ట్ర స్థాయి పోటీల్లో పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యారు. కే.మాన్‌వీక్, ఎం రితన్య, ఎం సంచిత్ ప్రతిభ కనబరిచి ఆదివారం హైదరాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అన్నారు. ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదవాలి

రామగిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): చదువును కష్టంతో కాకుండ ఇష్టంతో చదవాలని ఏఎమ్‌వో షైక్ అన్నారు. శనివారం బేగంపేట్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు, ఇంట్లో తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. హెచ్ఎం రాంకిషన్‌రావు మాట్లాడుతూ పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించే విద్యార్థులను సొంత ఖర్చులతో బెంగూళురు ట్రిప్ తీసుకెళ్తానని ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు పద్మజ, శ్రీనివాస్, సంపత్, గీతారాణి, స్వరూప, ఏపీసీ చైర్‌పర్సన్ చంద్రకళ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కళ్యాణ్‌నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు నాగరాజు సూచించారు. శనివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గోదావరిఖని హనుమాన్‌నగర్‌లో కాలనీవాసులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యంతో గుండె వ్యాధులు పెరుగుతున్నాయని, ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాలనీవాసులకు మధుమేహ, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేశారు. మెడికవర్ హెడ్ కిరణ్, ఉపేందర్, ఫజల్‌బేగ్, మురళి, చిరంజీవి, సురేష్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, హరీష్, యూనుస్ పాల్గొన్నారు.

ఘనంగా అకాడమిక్ ఫెయిర్


విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను తిలకిస్తున్న ప్రిన్సిపాల్

కోల్‌సిటీటౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయ కాలనీలోని నారాయణ పాఠశాలలో ఏజీఎం చైతన్యరావు ఆదేశాల మేరకు అకాడమిక్ ఫెయిర్ వేడుకలు శనివారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రజిని మాట్లాడుతూ విద్యా కార్యకలాపాల ఫలితాలను కొలవడానికి, కార్యకలాపాల ఆధారిత అభ్యాసాన్ని సరిగ్గా అమలు చేసిన సంవత్సరం పొడవునా నిర్వహించే వేడుకలను అకాడమిక్ ఫెయిర్‌గా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థుల వినూత్న ప్రాజెక్టులు, ప్రతిభను ప్రదర్శించారు. సైన్స్ నమూనాలు, గణిత ప్రాజెక్టులు, భాషా ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. ఈఛాంప్స్ కోఆర్డినేటర్ శ్రావణి, అకాడమిక్ డీన్ గర్రెపల్లి ఆంజనేయులు, ఏవో శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ సౌభాగ్య, రమాదేవి, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ ఇమ్రాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

కాల్వశ్రీరాంపూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ అన్నారు. పెగడపల్లి సన్‌షైన్ పాఠశాలలో కరస్పాండెంట్ నసీర్ ఆధ్వర్యంలో శనివారం పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు 114రకాల వంటకాలు తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. అతిథులను కరస్పాండెంట్ నసీర్ సన్మానించారు. మాజీ ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు సాంప్రదాయ వంటకాలు ప్రదర్శించినందుకు అభినందించారు. మాజీ సర్పంచ్ ఆరెల్లి సుజాతరమేష్, ఏఎస్సై నీలిమ, రిటైర్డ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో అధికారుల విచారణ

ఓదెల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పొత్కపల్లి వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో యూరియా బస్తాలు అక్రమ దారి పట్టాయనే వదంతులపై శనివారం కార్యాలయంలో ఏవో భాస్కర్ విచారణ చేపట్టారు. అనంతరం విలేకరులకు ఏవో వివరాలు వెల్లడించారు. మండలంలోని రైతులకు 444 యూరియా బస్తాలు రాగా రైతులకు విక్రయించామని, రైతులు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా డబ్బులు చెల్లించగా బ్యాంక్‌లో జమ చేయడంలో జాప్యం జరిగిందని తెలిపారు. ఈ విషయంలో విచారణ నిర్వహించగా, రైతులు చెల్లించిన డబ్బును, సంబంధిత రికార్డులను పరిశీలించి బ్యాంక్ లో రూ.1.16 లక్షల 370 రూపాయలను బ్యాంకులో జమ చేశామని, అక్రమాలు జరగలేదని ఏవో వివరించారు.

ఐఏఎస్ అధికారి నరహరి జన్మదిన వేడుకలు

కోల్‌సిటీటౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి జన్మదిన వేడుకలు శనివారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. గీతాంజలి హైస్కూల్‌లో కేక్‌కట్ చేసి పంపిణీ చే శారు. కరస్పాండెంట్ కంది రవీందర్‌రెడ్డి, రాజేంద్రకుమార్, బొంకూరి మధు, మైస రాజేష్, వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీను, ఇందారపు రవి పాల్గొన్నారు. మార్కండేయకాలనీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో కేక్‌కట్ చేశారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మిట్టపల్లి రాజేంద్రకుమార్ రక్తదానం చేశారు. ఆలయ ఫౌండేషన్ వాలంటీర్ సురేష్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం కమాన్‌పూర్ మండల అధ్యక్షుడు అంబటి కనుకయ్య ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ కలెక్టర్ పరికిపండ్ల నరహరి జన్మదిన వేడుకలను నిర్వహించారు. దాసరి రామస్వామి, గుర్రం లక్ష్మీమల్లి, మట్ట శంకర్, ఎరుకల లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ధర్మారం (ఆంధ్రజ్యోతి): నరహరి జన్మదిన వేడుకలను ధర్మారంలో నిర్వహించారు. సంజీవని హాస్పి టల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. శ్రీనివాస్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రాజు, ఎండి హఫీజ్, సురేందర్ రెడ్డి, పాల్గొన్నారు.